ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 30.0 । కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY



రైతులపై అడవి పంది దాడి

» జోగుళాంబ గద్వాల జిల్లా గంగన్‌పల్లిలో ఘటన

కేటీదొడ్డి, జూన్ 12 : రైతులపై అడవిపంది దాడి చేసి గాయపరిచింది. జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని గంగన్‌పల్లిలో బుధవారం ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన రైతులు బాషామౌలాలి, పాంటన్న పొలంలో పనులు చేస్తుండగా అడవిపంది వారిపై దాడి చేసి గాయపరిచింది. తీవ్రంగా గాయపడిన వారు అల్లపాడులోని ఓ ప్రైవేట్ క్లినిక్‌లో ప్రథమ చికిత్స చేయించుకున్నారని గ్రామస్థులు తెలిపారు.



మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన తనిఖీల్లో బయటపడ్డ కుళ్లిన మాంసం



ఫ్రిజ్‌లో నిల్వ ఉంచడంతో గడ్డకట్టిన మాంసం



ఆహార పదార్థాల తయారీలో వాడుతున్న కల్తీ నూనె



వనపర్తిలో అనుమతిలేని హోటల్ యజమానికి నోటీస్ జారీ చేస్తున్న అధికారులు

ప్రజల ఆరోగ్యంతో.. చెలగాటం

» ఫుడ్ లైసెన్సులు లేకుండానే హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వహణ
» విచ్చలవిడిగా వెలిసిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, మెస్‌లు..
» నిబంధనలు అమలు చేయని యాజమాన్యాలు
» నిద్రమత్తులో మునిసిపల్ శాఖ
» అడపాదడపా తనిఖీలకే పరిమితమైన ఆహార కల్తీ నియంత్రణ శాఖ

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం)/వనపర్తి టౌన్, జూన్ 12: మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, మెస్‌లు నిబంధనలు పాటించడం లేదు. మునిసిపాలిటీ ద్వారా కొంతమంది ట్రేడ్ లైసెన్సులు తీసుకోవడంతోనే సరిపెడుతూ, ఫుడ్ లైసెన్సులు విస్మరిస్తున్నారు. ఆహార భద్రత నిబంధనలు గాలికొదిలేసి, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై చర్యలు తీసుకోవాల్సిన ఆహార కల్తీ నియంత్రణ, మునిసిపల్ శాఖల అధికారులు నిద్రమత్తులో తూలుతున్నారు. ఫలితంగా వ్యాపారులు ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు.

ట్రేడ్ లైసెన్సులతో సరిపెడుతున్న వైనం..

ఏదైనా వ్యాపారాలు చేసుకోవాలంటే ముందుగా సంబంధిత మునిసిపల్ లేదా గ్రామ పంచాయతీల నుంచి ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలి. ఆ తర్వాత వాటి ఆధారంగా ఫుడ్ లైసెన్సులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ మహబూబ్ నగర్ జిల్లాలో హోటళ్లు, రెస్టారెంట్లు నిర్వహిస్తున్న చాలా మంది కేవలం ట్రేడ్ లైసెన్సులకే పరిమితమయ్యారు. ఫుడ్ లైసెన్సులు తీసుకోవడం లేదు. జిల్లాలోని మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్ మునిసిపాలిటీల పరిధిలో దాదాపు 360 వరకు హోటళ్లు, రెస్టారెంట్లు, మెస్‌లు, దాబాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, టిఫిన్ సెంటర్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అందులో 230 మంది మాత్రమే ట్రేడ్ లైసెన్సులు తీసుకున్నారు. మిగతా వారంతా అనధికారికంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే అనధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 800 వరకు హోటళ్లు, రెస్టారెంట్లు, మెస్‌లు, దాబాలు, ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్ సెంటర్లు ఉన్నాయని తెలుస్తోంది.

కుళ్లిన మాంసం.. కల్తీ నూనెలు

మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే తినే ఆహారం స్వచ్ఛమైనదిగా ఉండాలి. సగం రోగాలకు ప్రధాన కారణం మనం తీసుకునే ఆహారమే అని వైద్యులు చెబుతున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు ధనార్జనే ధ్యేయంగా కల్తీ నూనెలు, మసాలాలు, రసాయనాలు వాడుతూ రోగాలను తెచ్చిపెడుతున్నారు. మహబూబ్‌నగర్, వనపర్తిలలో ఫుడ్ సేఫ్టీ, మునిసిపల్ అధికారులు ఇటీవల హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీల్లో తనిఖీలు చేయగా విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. కుళ్లిన కూరగాయలు, ఫ్రిజ్‌లలో నిల్వ చేసిన మాంసాలు, మసాలాలు, బిర్యానీ తయారీ కోసం ఉపయోగిస్తున్న రంగులు, కల్తీ నూనెలు బయటపడ్డాయి. వాటి శాంపిల్స్ సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌లకు పంపించారు. వారికి అధికారులు జరిమానాలు విధించి, నోటీసులు జారీ చేయడంతోనే సరిపెట్టారు. కేసులు నమోదు చేయడం, సీజ్ చేయడం ఎక్కడా కనిపించకపోడం కొస మెరుపు. ఒక్క వనపర్తి జిల్లా కేంద్రంలో 200లకుపైగా హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు వెలిశాయి.



వనపర్తిలో తనిఖీ చేస్తున్న ఆహార కల్తీ నియంత్రణ, మునిసిపల్ అధికారులు

ఫుడ్ లైసెన్సులు కొంతమందికే..

నిబంధనల ప్రకారం ట్రేడ్ లైసెన్సులు ఉన్న వారికి మాత్రమే ఫుడ్ లైసెన్సులు ఇస్తారు. అయితే జిల్లాలోని ఆహార కల్తీ నియంత్రణ శాఖ జిల్లా వ్యాప్తంగా 60 నుంచి 70 వరకు మాత్రమే ఫుడ్ లైసెన్సులు జారీ చేసింది. మిగతా వారు వందల సంఖ్యలో ఫుడ్ లైసెన్సులు లేకుండానే హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, మెస్‌లు, ఫాస్ట్ ఫుడ్, టిఫిన్ సెంటర్లు నడుపుతున్నారు. వీరంతా కనీసం నిబంధనలు కూడా పాటించడం లేదు.

నామమాత్రపు దాడులు

హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, మెస్‌లపై ఫిర్యాదులు వస్తేనే ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. కానీ వారంతట వారు వెళ్లి దాడులు చేసిన దాఖలాలు లేవు. పైగా మీడియాకు సైతం సమాచారం ఇవ్వకుండా అడపాదడపా దాడులు చేసి, చేతులు దులుపుకుంటున్నారు. దాడులకు వెళ్లే క్రమంలో ఆ శాఖలో పనిచేసే వారే హోటళ్ల యాజమాన్యాలకు సమాచారం ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. హోటళ్ల యాజమాన్యాలతో డబ్బులు డిమాండ్ చేస్తూ మహబూబ్‌నగర్‌లో ఓ అధికారి గతంలో ఏసీబీకి చిక్కిన విషయం తెలిసిందే.

నిబంధనలు పాటించని యాజమాన్యాలు..

గతంలో ప్రభుత్వం ప్రివెన్షయన్ ఫుడ్ అడాల్ట్రేషన్ యాక్ట్‌ను రూపొందించింది. ఆ తర్వాత 2012 నుంచి కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్ యాక్ట్ ప్రకారం కచ్చితంగా ఫుడ్ లైసెన్సులు తీసుకోవాలని నిబంధన పెట్టింది. ఎవరూ ప్రమాణాలు, నిబంధనలు పాటించడం లేదు. గాలి, వెలుతురు, వాసన బయటకు వెళ్లేలా వంట గదులు ఏర్పాటు చేయాలని, వంట చేసేవాళ్ల పరిశుభ్రంగా, తల వెంట్రుకలు కూడా పడకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవాలని నిబంధనల్లో పేర్కొన్నారు. ఎలాంటి రసాయనాలు కలపకుండా వంటలు చేయాలని, మాంసం, ఇతర ఆహార పదార్థాలు నిల్వ ఉంచకుండా రోజూ మారుస్తుండాలనే ఇలా చాలా నిబంధనలు ఉన్నాయి. వాటిని ఏ ఒక్క యాజమాన్యమూ పాటించడం లేదు. ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాల పరిస్థితి దారుణంగా ఉంది.

ట్రేడ్ లైసెన్సులు ఉన్న వారికే ఫుడ్ లైసెన్సులు

మునిసిపాలిటీ వారు ఇచ్చే ట్రేడ్ లైసెన్సులు ఉన్న వారికే తమ శాఖ నుంచి ఫుడ్ లైసెన్సులు ఇస్తున్నాం. నిబంధనలు పాటించని వారిపై జరిమానాలు విధించడం వరకే మా బాధ్యత. మున్సిపాలిటీ శాఖకు వాటిని సీజ్ చేసే అధికారం ఉంటుంది. గత ఆరు నెలల నుంచి తమ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విస్తృతంగా దాడులు చేస్తున్నాం. టాస్క్‌ఫోర్స్ టీంలు కూడా వచ్చి దాడులు చేస్తున్నాయి. చాలా మందికి జరిమానాలు విధించడంతో పాటు జైలు శిక్షలు కూడా వేయించాం.
- మనోజ్‌కుమార్, ఆహార కల్తీ నియంత్రణ అధికారి, మహబూబ్‌నగర్ జిల్లా

నిద్ర మత్తులో మునిసిపల్ శాఖ..

ఆయా మునిసిపాలిటీ పరిధిలో ముందుగా ట్రేడ్ లైసెన్సులు ఎంతమందికి ఉన్నాయి, వాటిని ఆధారంగా చేసుకొని ఫుడ్ లైసెన్సులు ఎంతమంది తీసుకున్నారనే అంశంపై ప్రతీ నెల మునిసిపల్ అధికారులు తనిఖీలు చేపట్టాలి. కానీ ఇప్పటి వరకు ఆశాఖ అధికారులు ఒక్క తనిఖీ కూడా చేయలేదు. లైసెన్సులు తీసుకోని వారి హోటల్స్, రెస్టారెంట్లు, మెస్‌లు, క్యాంటీన్లు, ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్ సెంటర్లను సీజ్ చేసే అధికారం కేవలం మునిసిపల్ అధికారులకే ఉంటుంది. ఫుడ్ సేఫ్టీ అధికారులు జరిమానాలు విధించడం, జైలు శిక్షలు విధించడం వరకు మాత్రమే ఉంటుంది. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవలసిన మునిసిపల్ అధికారులు నిద్రమత్తులో తూగుతున్నారు. ఫలితంగా విచ్చలవిడిగా వెలిసిన హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నాయి.



మహబూబ్‌నగర్‌లోని ఏనుగొండ ప్రాథమిక పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



కొండారెడ్డిపల్లిలో విద్యార్థులకు దుస్తులను అందజేస్తున్న నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎంపీ మల్లు రవి

తొలిరోజు అంతంతే..

» ప్రారంభమైన పాఠశాలలు
» మొదటి రోజు తక్కువగా హాజరైన విద్యార్థులు
» మామిడి ఆకులతో స్కూళ్లకు తోరణాలు
» పలు చోట్ల స్టూడెంట్స్‌కు పూలు ఇచ్చి ఆహ్వానించిన ఉపాధ్యాయులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జూన్ 12: బడి గంట మోగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు బుధవారం తెరుచుకున్నాయి. మొదటి రోజు కావడంతో విద్యార్థులు అంతంతమాత్రంగానే హాజరయ్యారు. కొన్ని తరగతి గదుల్లో ఒకరిద్దరు మాత్రమే ఉన్నారు. ఉపాధ్యాయులు మాత్రం అందరూ వచ్చారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తెరుచుకోవడంతో సందడిగా మారాయి. ప్రభుత్వ పాఠశాలలను మామిడి తోరణాలు కట్టి, కొబ్బరి మట్టలతో అలంకరించారు. పండుగ వాతావరణం కల్పించేలా తీర్చిదిద్దారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పూలు ఇచ్చి స్వాగతం పలికారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలలకు రాని విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు వెళ్లారు. ప్రభుత్వ స్కూళ్లలో కల్పిస్తున్న వసతుల గురించి వివరించారు. నాణ్యమైన భోజనం, ఉచితంగా దుస్తులు, పుస్తకాలు అందిస్తున్నామని, పిల్లలను బడికి పంపాలని తల్లిదండ్రులను కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు: కలెక్టర్

కల్వకుర్తి: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించి, మెరుగైన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యమని, విద్యార్థులకు లక్ష్యంతో చదివి భవిష్యత్తులో రాణించాలని కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలల పునఃప్రారంభమయ్యాయి. కల్వకుర్తి మండలం మార్చాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకోవడానికి ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పిస్తోందని తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించడమే కాకుండా అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద అన్ని రకాల మౌలిక సౌకర్యాలు కూడా అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు పెరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు చదువుతోపాటు పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ సమతుల్యతపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఉన్నత రంగాల్లో రాణించిన వారు చాలా మంది ఉన్నారని తెలిపారు. బడి బయట పిల్లలు ఎవరూ ఉండవద్దని, అలాంటి వారిని గుర్తించి బడిలో చేర్పించాలని సూచించారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా ముందుకెళ్లాలని చెప్పారు. విద్యార్థులు నాలెడ్జ్ నైపుణ్యం, వ్యక్తిగత వికాసం, ఈ మూడింటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం విద్యార్థులకు నోట్, పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులను కలెక్టర్ పంపిణీ చేశారు. డీఈవో గోవిందరాజులు, పీడీ డీఆర్‌డీఏ చిన్నఓబులేష్, డీపీవో కృష్ణ, కల్వకుర్తి ఆర్డీవో ఎస్.శ్రీను, కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం, ఎంఈవో బాసునాయక్, స్థానిక ప్రజాప్రతినిధులు, హెచ్ఎం, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

● వంగూరు: ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ అని పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొండారెడ్డిపల్లిలో బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కలెక్టర్ పాల్గొన్నారు. విద్యార్థులకు పాఠ్య నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులను అందజేశారు. న్యాక్ సంస్థ నుంచి మంజూరైన 35 కుట్టు మిషన్లను మహిళలకు పంపిణీ చేశారు. జడ్పీటీసీ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, ఎంపీపీ భీమమ్మ, డీపీవో కృష్ణ, డీఈవో గోవిందరాజులు, తహసీల్దార్ కిరణ్మయి, ఎంఈవో శంకర్‌నాయక్, నాయకులు కృష్ణారెడ్డి, వేమారెడ్డి, పులిజాల కృష్ణారెడ్డి, లాలుయాదవ్, హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.


అవీనితికి పాల్పడిన వారికి శిక్ష తప్పదు

» మంత్రి జూపల్లి కృష్ణారావు



మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

అచ్చంపేట, జూన్, 12: గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన వారందరికీ శిక్ష తప్పదని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు. ప్రజాపాలన అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ మల్లు రవి గెలుపొందడంతో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం అచ్చంపేటలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. త్వరలో రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టి, పేదలకు అండగా నిలుస్తామన్నారు. పెంచిన పింఛన్‌లు త్వరలోనే అందజేస్తామన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో చేసిన అప్పులకు నెలకు రూ.60 వేల కోట్లు వడ్డీలు కడుతూ ఇబ్బందులు పడుతున్నామన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో సమస్యలు తెలుసుకొని, పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంపీ మల్లురవి అన్నారు. అంతకు ముందు ర్యాలీలో పాల్గొన్న ఎంపీ, మంత్రి, ఎమ్మెల్యే తదితరులపై కాంగ్రెస్ నాయకులు పూలు చల్లుతూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్యకర్తలు వారిని గజమాలతో సన్మానించారు. అనంతరం నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, శ్రీనివాసులు, గోపాల్ రెడ్డి, గౌరీ శంకర్, రామనాథం తదితరులు పాల్గొన్నారు.



జూరాల ప్రాజెక్టుకు పెరిగిన నీరు

జూరాలకు పెరిగిన వరద ప్రవాహం

» ఇన్‌ఫ్లో ఏడు వేల క్యూసెక్కులు
» ఆరు టీఎంసీల మేర నీటి నిల్వ

ధరూరు, జూన్ 12 : ఎగువన కురుస్తున్న వర్షాలతో జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. ఎగువనున్న ఆల్మట్టి జలాశయంలో 24.68 టీఎంసీలు, నారాయణపూర్ జలాశయంలో 24.20 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువన ఉన్న జూరాల జలాశయంతో 316.670 మీటర్లలో నీటి నిల్వ ఉండగా, ప్రాజెక్టులో నీటి నిల్వ 6.202 టీఎంసీలకు చేరుకుంది. బుధవారం 7,735 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా నమోదు కాగా, ప్రాజెక్టు నుంచి 156 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోందని జూరాల ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

కంకర గుట్టలు మాయం

» క్రషర్ వ్యాపారులకు కాసులు కురిపిస్తున్న ప్రభుత్వ సంపద
» మైనింగ్ నిబంధనలకు తూట్లు
» చర్యలకు ఉపక్రమిస్తున్న వారిపై రాజకీయ ఒత్తిళ్లు
» విజిలెన్స్ విచారణ చేపడితే నిగ్గు తేలనున్న నిజాలు



పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు షెట్టర్ల సమీపంలో క్రషర్ వ్యాపారులు కంకర తవ్విన స్థలం

కొల్లాపూర్, జూన్ 12 : అనుమతులు లేవు.. అడిగేటోళ్లు లేరు.. ఇంకేముంది పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం కోసం తీసిన కాల్వల్లో బయటపడ్డ లక్షల విలువ చేసే కంకర ముడి సరుకును దోచుకెళ్తున్నారు. ఇలా అక్రమార్కులకు కంకర వ్యాపారం కాసుల వర్షం కురిపిస్తుండగా ప్రభుత్వ ఆదాయానికి మాత్రం భారీ స్థాయిలో గండి పడుతోంది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని సున్నపుతండా సమీపంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు షెట్టర్ల నిర్మాణ పనుల వద్ద పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని కొత్తపేట గ్రామ శివారులో రాత్రి పగలు అనే తేడా లేకుండా నిత్యం కంకర తవ్వకాలు చేపట్టి భారీ వాహనాల ద్వారా ప్రభుత్వ సంపదను క్రషర్ మిషన్లకు తరలిస్తున్నారు. ఇంతా తతంగం జరుగుతున్న ప్రాజెక్టు అధికారులు కాని జిల్లా మైనింగ్ శాఖ, స్థానిక రెవెన్యూ శాఖ, పోలీస్ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ సంపదను అక్రమార్కులు ఇష్టానుసారంగా కొల్లగొడుతున్నారు. లక్షలు విలువ చేసే ప్రభుత్వ, ప్రకృతి సంపద దోపిడీకి గురవుతున్నా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ఉన్నతాధికారులు, జిల్లా మైనింగ్ శాఖ అధికారులు ఏమాత్రం స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సామాన్య ప్రజలు అటవీ ప్రాంతం నుంచి చిన్న కట్టె ముక్క తెచ్చుకున్న కేసులు చేస్తున్నా ప్రభుత్వ యంత్రాంగం నెలల తరబడి రాత్రింబవళ్లు ఇటాచీ వాహనాలు పెట్టి కాల్వల్లో బయటపడ్డ రాతి సంపద గుట్టలను టిప్పర్ల ద్వారా క్రషర్ కంపెనీలు మాయం చేస్తున్నా చోద్యం చూస్తున్న అధికారుల తీరుపై ప్రజలు రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దేశాభివృద్ధి కోసం రైతులకు సాగునీరందించాలనే లక్ష్యంతో వేల కోట్లు ఖర్చు పెట్టి ప్రాజెక్టు నిర్మాణాలు చేపడితే ప్రభుత్వ సంపదను అప్పన్నంగా దోచుకెళ్తున్న వారిపై జిల్లా ప్రభుత్వ యంత్రాంగం మైనింగ్ శాఖ ఎందుకు చర్యలు చేపట్టడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మైనింగ్ శాఖకు ఎలాంటి రాయల్టీ కట్టకుండా, రూపాయి ప్రభుత్వానికి చెల్లించకుండా ఇష్టానుసారంగా కంకర గుట్టలను మాయం చేస్తున్న వారిపై విజిలెన్స్ కమిటీ విచారణ చేపడితే దీని వెనక ఉన్న పాత్రధారులు సూత్రధారులు ఎవరో నిగ్గు తేలుతుందని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లక్షలు విలువ చేసే భూములను ప్రాజెక్టు నిర్మాణంకోసం తాము ప్రభుత్వం చెల్లించిన ధరలకే భూములు ప్రభుత్వానికి అప్పజెప్పామని అంటున్నారు. క్రషర్ మిషన్ వ్యాపారులు మాత్రం తమ భూముల్లో నుంచి వెలికితీసిన కంకరను అమ్ముకుని కాసులు వెనకేసుకుంటున్నారని పేర్కొంటున్నారు. నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని వెంటనే జిల్లాప్రభుత్వ యంత్రాంగం, మైనింగ్ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు. అడపా దడపాగా కంకర తరలిస్తున్న వాహనాలను ఆపే అధికారులపై రాజకీయ ఒత్తిళ్లకు పాల్పడుతూ వ్యాపారులు అధికారులను ఇబ్బందులకు గురి చేస్తున్న సంఘటనలు కూడా నెలకొన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ సంపదను పరిరక్షించాలని మైనింగ్ శాఖ చర్యలు చేపట్టాలని రైతులు నియోజకవర్గ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

విచారణ చేపడతాం

పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు కాల్వల నుంచి వెలికి తీసిన రాతి ముడి సరుకును తరలించేందుకు అనుమతులు లేవు. శాఖ అధికారులను పంపించి విచారణ చేపడుతాం. తవ్వకాలు జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తాం. అక్రమంగా తరలిస్తే శాఖ పరంగా చర్యలు చేపడుతాం. ఇప్పటి వరకు విషయం మా దృష్టికి రాలేదు.
- శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు

అధికారులకు, మాజీ సర్పంచ్‌కు షోకాజ్ నోటీసులు

గోపాల్‌పేట, జూన్ 12 : వనపర్తి జిల్లా గోపాల్‌పేటలో పనిచేస్తున్న పంచాయతీ సెక్రటరీలు, మాజీ సర్పంచ్‌కు షోకాజ్ నోటీసులను జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి రమణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో అనుమతి లేని పనులకు ఎక్కువ మొత్తంలో ఎంబీ నమోదు చేసి పంచాయతీ డబ్బులను దుర్వినియోగం చేశారని గోపాల్‌పేటకు చెందిన యాపచెట్టు శివ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదుతో కలెక్టర్ విచారణకు ఆదేశించారని, విచారణ అనంతరం మండల కేంద్రంలో పనిచేస్తున్న పంచాయతీ సెక్రటరీ బాలరాజుకు, నాలుగు నెలల కింద పనిచేసిన సెక్రటరీ హుసేనయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఏఈకి షోకాజ్ నోటీసులు అందజేశామని డీపీవో తెలిపారు.

ఇసుక డంపుల సీజ్

మదనాపురం, జూన్ 12 : వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని గోపన్‌పేట గ్రామ శివారులో ఊకచెట్టి వాగు నుంచి కొందరు అక్రమంగా రాత్రి వేళ ట్రాక్టర్ల సహాయంతో ఇసుకను తరలించి డంపు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ అబ్రహంలింకన్, ఎస్సై శేఖర్‌రెడ్డి ఆ గ్రామానికి చేరుకొని విచారణ అనంతరం 114 ట్రాక్టర్ల ఇసుక డంపులను సీజ్ చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పెరుగుతున్న ఉల్లి ధరలు

» క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.3300, కనిష్ఠంగా రూ.2,500 ధర



దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లికి వేలం నిర్వహిస్తున్న వ్యాపారులు

దేవరకద్ర, జూన్ 12: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన బహిరంగ వేలంలో ఉల్లి పంటకు గరిష్ఠంగా క్వింటాల్‌కు రూ. 3300, కనిష్ఠంగా రూ.2500 ధర పలికింది. నెల రోజుల నుంచి కొంత పెరుగుతోంద. కొన్నాళ్లుగా ధరలు తక్కువ ఉన్నందున కొందరు రైతులు నిల్వ చేసుకున్నారు. అలాంటి వారు ప్రతీ వారం కొంత మంది రైతులు మార్కెట్‌కు అమ్మకానికి తీసుకొస్తున్నారు. 40 క్వింటాళ్ల ఉల్లి అమ్మకానికి వచ్చినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు. గత వారం కంటే ఈ వారం రూ.600 ధర పెరిగిందని తెలిపారు. కొనుగోలు దారులు మార్కెట్‌లో ఉల్లిని కొనుగోలు బయట ప్రజలకు రూ. 50ల నుంచి రూ.60 వరకు విక్రయిస్తున్నారు.

ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ఆలస్యం?

నీట్-2024పై రగడే కారణం!.. తెలంగాణలో 56 కాలేజీల్లో 8,515 ఎంబీబీఎస్ సీట్లు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యకు సంబంధించి ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ ఈ ఏడాది ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. నీట్-2024పై దేశ వ్యాప్తంగా జరుగుతున్న రగడే ఇందుకు కారణం. నీట్ మార్కులపై ఇప్పటికే సుప్రీం కోర్టులో కేసు నడుస్తోంది. నీట్-2024ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్న పిల్‌ను కోర్టు తోసిపుచ్చింది. కానీ, నీట్ విషయంలో మరిన్ని కేసులు పడే అవకాశం ఉందని, విషయం అంత త్వరగా తేలేట్లుగా కనిపించడం లేదని జాతీయ వైద్య విద్య కమిషన్(ఎన్ఎంసీ) అధికారులు రాష్ట్ర వైద్య విద్య ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. మరోవక్క, దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలు, వాటిలోని సీట్ల వివరాలను ఎన్ఎంసీ తన వెబ్‌సైట్‌లో పెట్టింది. విద్యార్థులు ఆయా కళాశాలల్లోనే చేరాలనే పేర్కొంది. ఎన్ఎంసీ వెబ్‌సైట్ ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు కలిపి తెలంగాణలో 56 వైద్య కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో మొత్తం 8,515 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి.

కొత్త కాలేజీల సంగతేంటో?

రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తు చేసిన కొత్త వైద్య కళాశాలల అనుమతిపై ఎన్ఎంసీ ఏటూ తేల్చడం లేదు. అనుమతి ఇస్తారో ? ఇవ్వరో కూడా స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో కొత్త కళాశాలల్లో ఈ ఏడాది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం అనుమానంగానే ఉంది. గద్వాల, వరంగల్(నర్సంపేట), యాదాద్రి, మేడ్చల్ (కుత్బుల్లాపూర్), నారాయణపేట్, ములుగు, మెదక్, రంగారెడ్డి(మహేశ్వరం) జిల్లాల్లో వైద్య కళాశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆగస్టు- సెప్టెంబరులో ఎన్ఎంసీకి దరఖాస్తు చేసింది. ఆయా కళాశాలలను వర్చువల్‌గా, స్వయంగా తనిఖీ చేసిన ఎన్ఎంసీ బృందాలు పలు లోపాలను ఎత్తి చూపి వాటిని సరిచేసుకోవాలని సూచించాయి. ఆ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ లోపాలను సవరించింది. అయితే వైద్య కళాశాలలకు లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్ఓపీ) ఇచ్చేముందు ఎన్ఎంసీ బృందాలు మరోమారు తనిఖీ చేస్తాయి. మరికొద్ది రోజుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఎన్ఎంసీ బృందాలు ఇప్పటిదాకా మళ్లీ తనిఖీలకు రాలేదు. నిజానికి, తాము ఎత్తిచూపిన లోపాలను సరి చేసుకున్నట్టు చూపించిన తర్వాత వాటికి సంతృప్తి చెందితేనే ఎన్ఎంసీ అనుమతి ఇస్తుంది. ఒకవేళ అనుమతి ఇవ్వకపోతే ప్రభుత్వం అప్పీలు చేసుకునే వీలుంటుంది. ప్రభుత్వ కళాశాల కాబట్టి సర్కారే గ్యారంటీగా ఉండి లోపాలను సవరించుకుంటామని లిఖితపూర్వక హామీనిస్తుంది. దాంతో ఎన్ఎంసీ అనుమతి మంజూరు చేస్తుంది. ఈ వ్యవహారానికి 20-30 రోజుల సమయం పడుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. దీంతో త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరుతూ వైద్యవిద్య సంచాలకులు ఎన్ఎంసీకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎన్ఎంసీ ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది. మరోవక్క, అనుమతుల విషయమై కొన్ని వైద్య కళాశాలల యాజమాన్యాలు ఇప్పటికే కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి చర్చినట్టు సమాచారం.

గ్రూప్-1 మెయిన్స్ 7 రోజులు

(మొదటిపేజీ తరువాయి)

మీడియంలోనే రాయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న సమయంలోనే ఏ మీడియంలో రాసేదీ తెలపాల్సి ఉంటుంది. ఒక పరీక్ష తెలుగులో, మరో పేపర్‌ను ఇంగ్లిష్‌లో రాయడానికి వీల్లేదు. అలా వేర్వేరు మాధ్యమాల్లో రాసినవారి పేపర్లను పరిగణనలోకి తీసుకోరు. రాష్ట్రంలో సుమారు 563 గ్రూపు-1 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఈ నెల 9వ తేదీన నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను త్వరలోనే ప్రకటించనున్నారు. అందులో ఉత్తీర్ణులైనవారిని.. ఒక్కో పోస్టుకు 50 మంది అభ్యర్థుల చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేయనున్నారు. మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచే అభ్యర్థులను పోస్టులకు ఎంపిక చేస్తారు. ఈ నియామకాల్లో ఏలాంటి ఇంటర్వ్యూలూ ఉండవు. మెయిన్ పరీక్షలకు సంబంధించిన వివరాలను కమిషన్ అధికారులు బుధవారం వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం..

- పరీక్షల తొలిరోజు అయిన అక్టోబరు 21న క్వాలిఫైయింగ్ టెస్ట్ (జనరల్ ఇంగ్లిష్ పరీక్ష) నిర్వహించనున్నారు. అనంతరం ఇతర పేపర్ల పరీక్షలను నిర్వహిస్తారు. క్వాలిఫైయింగ్ టెస్ట్ కాకుండా మెయిన్స్‌లో మొత్తం 6 పేపర్లకు పరీక్షలను నిర్వహిస్తున్నారు.
- పరీక్షలన్నీ హైదరాబాద్, దాని చుట్టు పక్కల హెచ్ఎండీఏ పరిధిలోనే జరుగుతాయి.
- ప్రతిపేపర్‌లోనూ 150 మార్కులకు ప్రశ్నలుంటాయి.
- అభ్యర్థులు అన్ని పేపర్లూ రాయాల్సి ఉంటుంది. ఏ ఒక్క పరీక్షకు గైర్హాజరైనా ఆ అభ్యర్థులు రాసిన ఇతర పేపర్లను పరిగణనలోకి తీసుకోరు.
- క్వాలిఫయింగ్ పరీక్షను 10వ తరగతి ప్రమాణాలతో నిర్వహిస్తారు. ఇతర పేపర్ల పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను ఇప్పటికే ప్రకటించారు.

ఇదీ షెడ్యూలు

తేదీ	పేపర్
అక్టోబరు 21	జనరల్ ఇంగ్లిష్
అక్టోబరు 22	జనరల్ ఎస్సే (పేపర్-1)
అక్టోబరు 23	చరిత్ర, కల్చర్ అండ్ జాగ్రఫీ (పేపర్-2)
అక్టోబరు 24	ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం-గవర్నెన్స్ (పేపర్-3)
అక్టోబరు 25	ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ (పేపర్-4)
అక్టోబరు 26	సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ (పేపర్-5)
అక్టోబరు 27	తెలంగాణ మూమెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ (పేపర్-6)

గ్రూప్-1 ప్రిలిమినరీ కీ విడుదల

ఈ నెల 9వ తేదీన నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కీని విడుదల చేశారు. గురువారం (13వ తేదీ) నుంచి 17వ తేదీ మధ్య ఈ కీ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. కీపై అభ్యంతరాలుంటే.. 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తెలపాల్సిందిగా అభ్యర్థులకు అధికారులు సూచించారు.

నేడు లాసెట్ ఫలితాల విడుదల

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): లాసెట్ ఫలితాలను ఈ నెల 13వ తేదీన విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. గురువారం సాయంత్రం 3.30 గంటలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఈ ఫలితాలను ప్రకటించనున్నారు.

నేటి నుంచి రెండోదశ దోస్త్

డిగ్రీలో ప్రవేశాలకు సంబంధించి 13వ తేదీ నుంచి రెండో దశ దోస్త్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు కానుంది. మొదటి దశలో సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 15వ తేదీలో ముగియనుంది. 14,15వ తేదీల్లో అభ్యర్థులు తమ వెబ్‌ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ఔటర్.. బంగారు బాతే!

వాహనాల రద్దీతో నెల నెలా పెరుగుతున్న ఆదాయం

» ఏప్రిల్‌లో రూ.60 కోట్లు..

» మే నెలలో 62.7 కోట్ల రాబడి



హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు.. ఆదాయ పరంగా బంగారు బాతు అన్నది స్పష్టమవుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీతో ఆదాయం భారీగా పెరుగుతోంది. ప్రతి నెలా హెచ్ఎండీఏ అధికారులు ఊహించని స్థాయిలో రాబడి వస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డును లీజుకు ఇచ్చే సందర్భంలో ఓ ప్రైవేటు ఏజెన్సీ మదింపు చేసిన ఆదాయ అంచనాలన్నీ తలకిందులవుతున్నాయి. అప్పుడు.. ఏడాదికి 2శాతం నుంచి 3శాతం వరకు ఆదాయం పెరుగుతుందని అంచనాలు వేయగా, ప్రస్తుతం ఒక్కో నెలకే 4శాతానికి పైగా పెరుగుతోంది. టోల్ చార్జీలు పెంచక ముందే ఆదాయం ఈ స్థాయిలో పెరుగుతుండడంతో.. చార్జీల పెంపుతో మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఔటర్ ఆదాయంపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలు అక్షరసత్యాలు అని నిరూపితమవుతున్నాయి. గతేడాది ఔటర్ రింగ్ రోడ్డును హెచ్ఎండీఏ గత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిన విషయం తెలిసిందే. దీంతో ఏటేటా భారీ ఆదాయాన్ని సమకూర్చే ఔటర్‌ను చాలా తక్కువ బిడ్‌కు 30 ఏళ్లకు లీజుకివ్వడాన్ని ప్రస్తావిస్తూ.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతోపాటు ఔటర్‌పై ఏటా పెరిగే ఆదాయ, వ్యయాలను అంచనా వేసి చూపిస్తూ.. రాష్ట్రానికి బంగారు బాతు లాంటి ఔటర్‌ను ప్రైవేటుపరం చేయడాన్ని పేర్కొంటూ 'బంగారు బాతు.. బలి' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. ఈ కథనాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడంతోపాటు అప్పటి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాయి. విపక్షాలకు అస్త్రంగా మారాయి. ఆ కథనాలన్నీ ఇప్పుడు అక్షరసత్యాలుగా నిరూపితమవుతున్నాయి.

టోల్ చార్జీల పెంపుతో సంబంధం లేకుండానే

ఔటర్‌ను ప్రైవేటు సంస్థకు అప్పగించిన సందర్భంలో ఆదాయాన్ని మదింపు చేసిన ఏజెన్సీ. ఏటా 2శాతం నుంచి 3శాతానికి అటు, ఇటుగా రాబడి పెరుగుతుందని అంచనాలు వేసింది. ముఖ్యంగా హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ (డబ్ల్యూపీఐ) ప్రకారం ఏటా టోల్ చార్జీల్లో చోటుచేసుకునే 4శాతం నుంచి 5శాతం పెంపుదల మేరకే ఆదాయం పెరుగుతుందని ఆ ఏజెన్సీ తేల్చింది. సాధారణంగా ఏప్రిల్ నుంచి కొత్తగా అందుబాటులోకి వచ్చే టోల్ చార్జీలతో ఆ ఆర్థిక సంవత్సరానికి ఆదాయం పెరుగుతుందని హెచ్ఎండీఏ అధికారులు కూడా అంచనాలు వేశారు. కానీ, ప్రస్తుతం టోల్ చార్జీలు పెంచకుండానే ప్రతి నెలా ఆదాయం పెరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.60.2 కోట్ల ఆదాయం రాగా, మే నెలలో రూ.62.7 కోట్లు వచ్చింది. అంటే దాదాపు రూ.2.5 కోట్లు పెరిగింది. ఒక్క నెలకే 4.2 శాతం పెరుగుదల నమోదైంది. ఈ పెరుగుదల గతేడాది నుంచి కొనసాగుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ వాహనాల రద్దీ పెరుగుతుండడంతో ఆ మేరకు ఆదాయం పెరుగుతోంది. కాగా, డబ్ల్యూపీఐ ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఔటర్ రింగ్ రోడ్డుపై టోల్ చార్జీలు ఏప్రిల్ 1 నుంచే పెరగాలి. కానీ, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిని పెంచకుండా నిలిపివేశారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగియడంతో టోల్ చార్జీలు పెంచుకోవడానికి అవకాశం కల్పించారు. దాంతో ఈ చార్జీలు 4శాతం నుంచి 5శాతం మేర పెరిగాయి. ఇందుకు అనుగుణంగా ఆదాయం పెరుగుతుందని, వాహనాల రద్దీ ద్వారా వచ్చే ఆదాయం అదనంగా ఉంటుందని హెచ్ఎండీఏ- హెచ్‌జీసీఎల్‌కు చెందిన ఓ అధికారి తెలిపారు.

పునరావాస గ్రామాల తరలింపు తథ్యం: డీఎఫ్‌వో



వటవర్లపల్లి గ్రామ సభలో మాట్లాడుతున్న డీఎఫ్‌వో రోహిత్ గోపిడి

దోమలపెంట, జూన్ 12: అమ్రాబాద్ అభయారణ్యంలో ఉన్న గ్రామాలను మైదాన ప్రాంతాలకు తరలించేందుకు అటవీశాఖ అధ్వర్యంలో ఎన్‌టీసీఏ (నేషనల్ టైగర్ కన్జర్వేషన్ ఆఫ్ అథారిటీ) పథకంలో భాగంగా స్వచ్ఛంద పునరావాసం కోరుకుంటున్న అర్హులైన వారందరికీ అన్ని మౌలిక వసతులతో కూడిన గ్రామాన్ని ఏర్పాటు చేస్తామని డీఎఫ్‌వో రోహిత్ గోపిడి అన్నారు. బుధవారం వటవర్లపల్లి గ్రామ ప్రత్యేక పాలనాధికారి అమ్రాబాద్ ఎంపీవో వెంకటయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన గ్రామ సభ సమావేశానికి డీఎఫ్‌వో హాజరయ్యారు. ఈ సందర్భంగా పునరావాసం కోరుతున్న గ్రామస్థులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ ఇప్పటికే సార్లపల్లి, కుడిచింతలబావి, తాటిగుండాల, కొమ్మనపెంట గ్రామాల తరలింపు ప్రక్రియ లబ్ధిదారులు ఎంపిక పూర్తి అయిందన్నారు. వటవర్లపల్లిలో 773 మంది దరఖాస్తులు చేసుకోగా, ఇందులో 634 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. 78 మంది స్థానిక ఆధారాలు లేనివారు, 23 మంది భూమి, ఇల్లు కలిగి స్థానికంగా లేని వారు, 23 మంది 18 సంవత్సరాలు నిండని మైనర్లు, 8మంది పెళ్లి అయిన వారిని దరఖాస్తులు తిరస్కరించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో సరైన స్థానిక ఆధారాలు కలిగిన వారు మళ్లీ దరఖాస్తు చేస్తే పరిశీలిస్తామన్నారు. స్వచ్ఛంద పునరావాసం కోరుతున్న వారికి పెద్దకొత్తపల్లి మండలం బాచారం గ్రామంలో ఉన్న అటవీ భూమిని పూర్తిగా రెవెన్యూ భూమిగా బదలాయించి లబ్ధిదారునకే సర్వహక్కులు కలిగే ఉండే విధంగా ఉంటుందన్నారు. ఆప్షన్-1 రూ. 15లక్షలు, ఆప్షన్-2 లబ్ధిదారులకు 250 గజాల ఇంటి స్థలంలో డబుల్ బెడ్‌రూం ఇంటిని నిర్మించి, ఐదు ఎకరాల వ్యవసాయ భూమిని సాగుకు అనుకూలంగా మార్చి ఇవ్వడం జరుగుతుందని, ఇందులో ఎవరి బలవంతం లేదని, ఇష్టపడి వచ్చేవారికే అన్నిరకాల వసతులతో గ్రామాన్ని ఏర్పాటు చేసిన తర్వాతనే ఇక్కడి నుంచి తరలిస్తామన్నారు. కార్యక్రమంలో దోమలపెంట ఎఫ్ఆర్‌వో గురుప్రసాద్, ఎన్‌జీవో బాపిరెడ్డి ఎఫ్ఎస్‌వోలు భాగ్యమ్మ, వాసవి పంచాయతీ కార్యదర్శి టీపీ రేణయ్య ఎఫ్‌బీవోలు ముత్యాలు, తేజశ్రీ, శరత్, రాజేశ్వరి, స్వేత, శిల్ప గ్రామ పునరావస కమిటీ అధ్యక్షుడు అప్పీస్ సాయిబాబు, సభ్యులు జానకిరాం, లక్ష్మణ్‌రాజు, బాలకృష్ణ, తులసినాయక్, మక్బూద్, కరీం, శివ, ప్రవీణ్, శ్యాంసుందర్, పరమేశ్వర్, జూల్యానాయక్, ప్రభాకర్, జగన్‌మోహన్ అండాలమ్మ, సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో అసిస్టెంట్ కమాండెంట్



ఏసీబీకి చిక్కిన అసిస్టెంట్ కమాండెంట్ వి. నర్సింహ స్వామి

ఎర్రవల్లి, జూన్ 12 : జోగుళాంబ గద్వాల జిల్లా టీజీఎస్‌పీ 10వ బెటాలియన్‌కు చెందిన అసిస్టెంట్ కమాండెంట్ వి. నర్సింహ స్వామి, రిటైర్డ్ ఏఆర్ఎస్ఐ కటిక అబ్బుల్ వాహబ్‌లు బుధవారం ఏసీబీ వలకు చిక్కారు. ఈ ఘటనకు సంబంధించి డీఎస్పీ కృష్ణగౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. టీజీఎస్‌పీ 10వ బెటాలియన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ గోవర్ధన్‌కు మరో కానిస్టేబుల్ రతన్‌లాల్‌కు మధ్య గతంలో వివాదం ఉన్నది. దీనిపై అప్పట్లో కమాండెంట్‌కు ఫిర్యాదు అందడంతో రతన్‌లాల్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో కానిస్టేబుల్ గోవర్ధన్ కూడా డ్యూటీకి సక్రమంగా వెళ్లడంలేదని ఫిర్యాదు ఉన్నది. వీటిపై విచారణ అధికారిగా అసిస్టెంట్ కమాండెంట్ వి. నర్సింహ స్వామిని నియమించారు. విచారణ అనుకూలంగా ఉండాలంటే రూ. 50 వేలు ఇవ్వాలని కానిస్టేబుల్ గోవర్ధన్‌ను డిమాండ్ చేశారు. ఈ లావాదేవీల తతంగం నడిపేందుకు పాత పరిచయాలు ఉన్న రిటైర్డ్ ఏఆర్ఎస్ఐ కటిక అబ్దుల్ వాహబ్ మధ్యవర్తిత్వం పుచ్చుకున్నాడు. దీనిపై ఏసీబీకి గోవర్ధన్ ముందస్తు సమాచారం ఇచ్చాడు. బుధవారం సాయంత్రం అలంపూర్ చౌరస్తా దగ్గర ఒక ప్రదేశంలో రూ. 50 వేలను రిటైర్డ్ ఏఆర్ఎస్ఐ కటిక అబ్దుల్ వాహబ్‌కు ఇచ్చాడు. ఆయన 10వ బెటాలియన్‌కు చేరుకొని అసిస్టెంట్ కమాండెంట్‌కు ఇవ్వగానే ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పరీక్షలలో కూడా ధ్రువీకరణ జరిగింది. దీంతో ఇద్దరినీ అరెస్టు చేశారు.

కుక్కల దాడిలో జింక మృతి

చారకొండ, జూన్ 12: నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ సమీపంలో ఉన్న అడవి నుంచి బుధవారం తెల్లవారుజామున దారితప్పి జింక రావడంతో వీధి కుక్కలు దాడి చేయగా, మృతి చెందింది. గమనించిన స్థానికులు పోలీసులకు, ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించడంతో డీఆర్‌వో రేణుక, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతి చెందిన జింకను పరిశీలించి అక్కడే పంచనామా చేశారు. పోస్టుమార్టం కోసం మండల కేంద్రంలోని పశువైద్యశాలకు తరలించారు. అక్కడ మండల పశువైద్యాధికారి శివకుమార్ వీఎల్‌వో షెక్‌మదర్‌తో కలిసి పోస్టుమార్టం నిర్వహించారు. వీధి కుక్కలు జింకపై దాడి చేసి అవయవాలను పీక్కుతిన్నట్లు ఆయన తెలిపారు. అనంతరం మృతి చెందిన జింకను ఫారెస్ట్ బీట్ అధికారి వెంకటరమణకు అందజేశారు. మృతి చెందిన జింకను సమీపంలోని అడవిలో ఖననం చేసినట్లు ఫారెస్ట్ బీట్ అధికారి తెలిపారు.

మన్నెవాగులో మహిళ మృతదేహం

చిన్నచింతకుంట, జూన్ 12 : మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం చిన్న వడ్డెమాన్ గ్రామ సమీపంలోని మన్నెవాగులో బుధవారం ఓ మహిళా మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. నర్వ మండలం లంకాల గ్రామానికి చెందిన మాదిగ సంజమ్మ (50) అనే మహిళ తన తల్లిగారి ఊరు చిన్నచింతకుంట మండలం లక్ష్మీదేవిపూర్‌కు వెళ్లిందని తెలిసింది. ఆమె మృతిపై కుటుంబ సభ్యులు వచ్చి సమాచారం ఇస్తేగానీ పూర్తి వివరాలు తెలుస్తాయని ఎస్ఐ శేఖర్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

ఖిల్లాఘణపురం, జూన్ 12 : ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం సోలీపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాగుల మహేష్(24) మంగళవారం సాయంత్రం ఇంట్లోంచి వెళ్లి తమ వ్యవసాయ పొలానికి సమీపంలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుడికి మూడు నెలల క్రితమే వివాహం జరిగింది. మృతుడి తండ్రి కురుమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మహేష్ అంత్యక్రియల్లో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, సతీమణి రమాదేవి, కుమారుడు జిల్లెల ఆదిత్యరెడ్డి పాల్గొని కన్నీటి పర్యంతమయ్యారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

లింగాల, జూన్ 12 : నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామానికి చెందిన వివాహిత మహిళ శ్వేతాబాయి(25) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం కలకలం రేపింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ప్రశాంత్‌కు ఐదేళ్ల క్రితం కల్వకుర్తి మండలం వేపూరు గ్రామానికి చెందిన శ్వేతాబాయితో వివాహం జరిగింది. మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలం మద్దిమడుగు దేవాలయాలకు వెళ్లి దైవదర్శనం చేసుకుని వచ్చారు. కుటుంబ కలహాల వల్ల తీవ్ర మనస్తాపానికి చెందిన ఆమె క్షణికావేశంలో తన ఇంటికి అనుసరించి ఉన్న పాత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు కొన ఊపిరితో ఉన్న ఆమెను వెంటనే నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. మృతురాలికి భర్త ప్రశాంత్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బంగారం, నగదు చోరీ

మల్దకల్, జూన్ 12: జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రానికి చెందిన ఉరుకుంద ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదిశిలా క్షేత్రంలో విధులు నిర్వహిస్తున్న ఉరుకుంద కుటుంబసభ్యులతో కలిసి శనివారం ఇంటికి తాళం వేసి కర్నాటకలోని రాయిచూరుకు వెళ్లారు. మంగళవారంరాత్రి తిరిగి వచ్చిన వారికి ఇంటి తాళం విరిగి ఉండటం కనిపించింది. లోనికి వెళ్లి పరిశీలించగా బీరువా తాళాలు కూడా పగులగొట్టి ఉన్నాయి. అందులోని రూ.30 వేల రూపాయలు, మూడు తులాల బంగారం చోరీకీ గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో, వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మద్దిమడుగు ఆంజన్నకు ఎంపీ, ఎమ్మెల్యే పూజలు



ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీ డాక్టర్ మల్లు రవి

అమ్రాబాద్ జూన్ 12: పదర మండల పరిధిలోని మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి ఆలయంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి, అచ్చంపేట శాసనసభ్యుడు డాక్టర్ వంశీకృష్ణ బుధవారం వేరువేరుగా వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్ కర్నూల్ పార్లమెంటుకు కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి మల్లు రవి ఎంపీగా గెలుపొందడంతో వారు ఈ పర్యటన చేపట్టారు. వారిని ఆలయ మర్యాదలతో అధికారులు సత్కరించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. అనంతరం బాపన్ పాడు గ్రామ గిరిజన రైతులకు చెందిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్‌ను ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రారంభించారు.

కొల్లాపూర్ యువకుడికి డాక్టరేట్



అజయ్‌కుమార్

కొల్లాపూర్, జూన్ 12 : ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఫిజిక్స్ విభాగంలో కొల్లాపూర్ పట్టణవాసి అజయ్‌కుమార్‌కు డాక్టరేట్ పట్టా వచ్చింది. రిటైర్డు ప్రొఫెసర్ జే శివకుమార్ పర్యవేక్షణలో ఫిజిక్స్ విభాగంలో లిథియం, అయాన్ ఆధారిత నానోమిశ్రమ పాలిమర్ బ్లడ్ ఎలక్ట్రోలైట్ అనే అంశంపై అజయ్ కుమార్ పరిశోధన పూర్తి చేశారు. పరిశోధనకు సంబంధించి వ్యాసాలు, ఫైల్స్ పై ఫైటేషన్ ఇండెక్స్ కలిగిన జనరల్ ఆఫ్ పాలిమర్ అండ్ ది ఎన్విరాన్‌మెంటల్ జనరల్ ఆఫ్ పాలిమర్ రిసెర్చ్ పాలిమర్ ప్లాస్టిక్ టెక్నాలజీ మెటిరీయల్స్‌లో ప్రచురితమయ్యాయి. ప్రస్తుతం అజయ్‌కుమార్ గద్వాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. కొల్లాపూర్ పట్టణానికి చెందిన సుబ్బయ్య, సత్యమ్మ దంపతుల కుమారుడు అజయ్ చిన్ననాటి నుంచే విద్యాభ్యాసం ప్రభుత్వ విద్యా సంస్థల్లో కొనసాగింది. గతంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఎస్సీ ఫిజిక్స్‌లో రెండు బంగారు పతకాలు సాధించినట్లు అజయ్‌కుమార్ అన్న అరుణ్‌కుమార్ వెల్లడించారు. అజయ్‌కుమార్ ఉన్నత చదువులపై ఉన్న ఆసక్తిని కొల్లపూర్ ప్రజలు అభినందించారు.

విద్యార్థులకు సన్మానం



కొండూరులో విద్యార్థులను సన్మానిస్తున్న కేతూరి ధర్మతేజ

పెంట్లవెల్లి, జూన్ 12 : మండల పరిధిలోని కొండూరు గ్రామంలో పదవ తరగతి పూర్తి చేసుకుని ఇంటర్ గురుకుల సీట్లు సాధించిన, అదేవిధంగా 5వ తరగతిలో గురుకుల సీట్లు సాధించిన విద్యార్థులకు బుధవారం రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కొండూరు గ్రామాన్ని ఎంపిక చేయడం శుభసూచికమని వారు పేర్కొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో గురుకుల పాఠశాలల కంటే దీటుగా మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. గ్రామంలో ఉపాధ్యాయులతో కలిసి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ సర్పంచ్ నల్లపోతుల గోపాల్, కాంగ్రెస్ నాయకులు కుర్మయ్య పలస రవి, ఎల్లగౌడ్, ఖలీల్, నరసింహ, సత్తి, శివ తదితరులు పాల్గొన్నారు.

బెస్టు అవైలబుల్ స్కూల్స్‌కు విద్యార్థుల ఎంపిక



లక్కీ డిప్ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తున్న అదనపు కలెక్టర్

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 12: జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశాలకు విద్యార్థుల ఎంపిక ప్రక్రియ పూర్తయ్యింది. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో లక్కీ డిప్ ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులు సమక్షంలో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2024- 25 విద్యా సంవత్సరానికి ప్రవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో డే స్కాలర్ 88 సీట్లు ప్రవేశం కోసం, 5వ తరగతిలో రెసిడెన్సియల్ స్కూల్స్‌లో 90 సీట్ల ప్రవేశం కోసం లక్కీ డిప్ ద్వారా ఎంపిక ప్రక్రియ పూర్తయ్యిందని పేర్కొన్నారు. జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి రాంలాల్, ఏఎస్‌డబ్ల్యూఓ సుదర్శన్, సూపరింటెండెంట్ రాంజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం



మాట్లాడుతున్న జిల్లా లేబర్ ఆఫీసర్ షఫియోద్దీన్

లింగాల, జూన్ 12 : మండలంలో ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ సౌజన్యంతో కోనేరు సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా లేబర్ ఆఫీసర్ షఫియోద్దీన్ పాల్గొని మాట్లాడారు. 18సంవత్సరాలలోపు పిల్లలను కిరాణం, ధాబా, హోటళ్లల్లో, పశువులు, మేకల కాసేందుకు, ఇంట్లో పనికి ఎవరు కూడా పిల్లలను వెట్టిచాకిరీ చేయించే వారిని గుర్తించాలని సూచించారు. తమ దృష్టికి వస్తే కచ్చితంగా కేసులు నమోదు చేస్తామని వారన్నారు. డీసీపీవో కార్యాలయం అధికారి వేణుగోపాల్ మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శేఖర్, కోనేరు సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆంజనేయులు, శ్రీనివాసులు, జాకీర్‌హుస్సేన్, చైల్డ్‌లైన్ ప్రమీల, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ కౌన్సిలర్ మల్లేష్, ఉపాధ్యాయ బృందం అరవింద్, వెంకటరాజు, పురుషోత్తమ్, పరుశరాములు, సుందరాయ, పీడీ స్వరూప, చంప్లి, శ్రీనునాయక్, శ్రీనివాసులు, నిరంజన్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు మంత్రి సురేఖకు ఆహ్వానం



మంత్రి సురేఖకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కందనూలు, జూన్ 12: జిల్లాలోని అత్యంత పురాతన వైష్ణవ ఆలయాల్లో ఒకటైన శ్రీపురం శ్రీరంగనాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు రావాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో మంత్రి కొండా సురేఖను కలిసిన కమిటీ సభ్యులు శ్రీధర్‌రెడ్డి ఆలయ విశేషాలను వివరించారు. ఆలయ కమిటీ సభ్యులు టీవీ మురళీధరాచార్యులు, వాస్తాల శ్రీధర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మల్లికార్జున్, విశ్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



కొల్లాపూర్‌లోని గాంధీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య, పాఠశాల ఉపాధ్యాయులు

కొల్లాపూర్, జూన్ 12: విద్యార్థులు అవకాశాలను సద్వినియోగపర్చుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య పిలుపునిచ్చారు. బుధవారం కొల్లాపూర్ పట్టణంలోని గాంధీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను, నోటు బుక్కులను ఉపాధ్యాయులతో కలిసి ఆమె విద్యార్థులకు అందజేశారు. అనంతరం గాంధీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శాలువా పూల మాలలతో ఆమెను సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఉపాధ్యాయ ఉపాధ్యాయినీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● **సోమశిలలో..**

మండల పరిధిలోని సోమశిల గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాలు అందజేశారు. ప్రభుత్వం చేపట్టిన బడిబాట ద్వారా గ్రామంలో ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్, పాఠశాల కమిటీ చైర్మన్ సుల్తానా, మాజీ సర్పంచ్ బ్యాంగి మద్దిలేటి, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ బోయ నరసింహ, ఉపాధ్యాయులు వెంకట్‌రాంరెడ్డి, బ్యాంగి కృష్ణప్రసాద్, రాజేశ్వరి, రమణబాబు, అనిత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

● కల్వకుర్తిటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అన్నారు. పట్టణంలో బుధవారం ఆయన పలు ప్రాథమిక పాఠశాలల్లో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ విద్యార్థికి ఉపాధ్యాయులు గుణాత్మక విద్యను అందించేందుకు కృషిచేస్తారని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యురాలు నసీమా, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని లింగసానిపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. పాఠశాలకు మామిడి తోరణాలను కట్టి విద్యార్థులకు ఘనస్వాగతం పలుకుతూ ఉపాధ్యాయులు ఆహ్వానించారు. పాఠశాలకు హాజరైన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులను అందజేశారు. పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● లింగాల: వేసవి సెలవుల అనంతరం బుధవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా 2024-25 విద్యా సంవత్సరానికి అవసరమగు పాఠ్య పుస్తకాలను పాఠశాలల పునః ప్రారంభం రోజే పంపిణీని ప్రారంభించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో నిల్వ ఉంచిన పాఠ్య పుస్తకాలను వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు తీసుకవెళ్లారు. పుస్తకాలతో పాటు యూనిఫాం పంపిణీని కూడా ప్రారంభించారు. హెచ్ఎం శేఖర్, సీఆర్‌పీ హరిలాల్, విష్ణు, కృష్ణయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

● చారకొండ: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని ఎంపీడీవో ఇసాక్ హుసేన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు ఎంపీడీవో అందజేశారు. అనంతరం పాఠశాలలో మౌలిక వసతులను పరిశీలించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసు కోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కాంప్లెక్స్ హెచ్ఎం యాదగిరి, పంచాయతీ కార్యదర్శి గణేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● పెద్దకొత్తపల్లి: మండల పరిధిలోని ముష్టిపల్లి గ్రామంలో పాఠశాల విద్యార్థులకు ఆ గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు, ఉన్నత పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గాదారి లింగమ్మ ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. అలాగే ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు నోటు బుక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

● కోడేరు: మండల కేంద్రంతో పాటు వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన పాఠ్య పుస్తకాలు, నోటు బుక్కులు కాంప్లెక్స్ హెచ్ఎం కృష్ణయ్య బుధవారం పంపిణీ చేశారు. అనంతరం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి ప్రైవేట్ పాఠశాలలు వద్దు ప్రభుత్వ పాఠశాలు ముద్దు అని అవగాహన కల్పించారు.

● తిమ్మాజిపేట : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో చదివే విద్యార్థులకు బుధవారం ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. విద్యార్థులకు అవసరమయ్యే ఏకరూపక దుస్తులను స్వయంసహాయక మహిళా సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో కుట్టి సంబంధిత పాఠశాలలకు అందజేశారు. ఎంపీడీవో లక్ష్మీదేవి మాట్లాడారు. ఎంపీటీసీ లీలావతి, ఎంఈవో శ్రీనివాసు లు, జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సత్యనారాయణశెట్టి, మండల సమాఖ్య అధ్యక్షురాలు రుద్రమదేవి, ఏపీఎం శ్రీహరి ఉన్నారు.

● అమ్రాబాద్: అమ్రాబాద్ మండల పరిధిలోని39 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 3416 మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులతో పాటు, పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు పంపిణీ చేయడానికి మండల రిసోర్స్ సెంటర్లో సిద్ధంగా ఉన్నాయని అమ్రాబాద్ మండల విద్యాధికారి బాలకిషన్ బుధవారం విలేకరులుకు తెలిపారు. మహిళా సమాఖ్య సభ్యులు స్టిచ్చింగ్ చేసిన ఏకరూప దుస్తులను విద్యార్థులకు అందజేశారు.

విద్యాభివృద్ధిలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలి



పంజుగులలో విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు

కల్వకుర్తి, జూన్ 12 : విద్యాభివృద్ధిలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని, విద్యార్థులందరికీ మెరుగైన విద్యనందించాలని సూచించారు. కల్వకుర్తి మండలం పంజుగుల గ్రామంలో బుధవారం బడిబాట కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, ఎంపీపీ మనోహర, మాజీ జడ్పీటీసీ అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బ్యాంగి ఆనంద్‌కుమార్, ఎంపీడీవో వెంకటరాములు, ఎంఈవో బాసునాయక్, స్థానిక హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్, జూన్ 12: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని టంగాపూర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఏకరూప దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థికి ఉన్నత విద్యను అందిచాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. పాఠశాలల బలోపేతం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎంఈవో రామారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కల్వకుర్తి బలరాంనగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, ఉపాధ్యాయులు



చారకొండలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో ఇసాక్ హుసేన్

పేదలకు అండగా ఉంటాం

- డబుల్ బెడ్రూం ఇళ్ల సమస్య సీఎం దృష్టికి తీసుకెళ్తా

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



కల్వకుర్తిలో డబుల్‌బెడ్రూం ఇళ్లను పరిశీలించి బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, జూన్ 12 : పేదలందరికీ సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. పట్టణంలోని డబుల్‌బెడ్రూం ఇళ్ల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి వసతులు సమకూర్చడంతో పాటు లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలో 99సర్వేలోని డబుల్‌బెడ్రూం ఇళ్లను, బస్టాండ్ సమీపంలోని ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్‌ను జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బ్యాంగి ఆనంద్‌కుమార్, ఆర్డీవో ఎస్.శ్రీను, తహసీల్దార్ ఇబ్రహీంలతో కలిసి ఎమ్మెల్యే బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డబుల్‌బెడ్రూం ఇళ్లలో అసంపూర్తిగా మిగిలిన పనులను గుర్తించారు. వాటిని పూర్తి చేయించి లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లను ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని, ఈ విషయంలో లబ్ధిదారులు ఎవరూ ఆందోళన చెందాల్సినవసరం లేదని ఎమ్మెల్యే సూచించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో అర్హులందరికీ గృహజ్యోతిలో విడతల వారిగా ఇళ్లను కేటాయిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా ఎస్సీ కాంప్లెక్స్‌ను పరిశీలించి మిగిలిపోయిన పనులు పూర్తయ్యేలా చూడాలని అర్హులైన పేదలకు అందేలా చూస్తామని ఎమ్మెల్యే తెలిపారు. పలువురు కౌన్సిలరుల, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

ఇళ్ల మీద ఉన్న ఎల్‌టీ లైన్లు తొలగించండి

కోడేరు, జూన్ 12 : గ్రామా ల్లో ఇళ్ల మీద ఉన్న ఎల్‌టీ లైను, విద్యుత్ తీగలను తొలగించాలని వైస్ ఎంపీపీ కొత్త శ్రీని వాసరావు సభ దృష్టికి తెచ్చారు. బుధవారం మండల పరి షత్ కార్యాలయంలో మండల సర్వసాధారణ సర్వసభ్య సమా వేశం ఎంపీపీ కొండా రాధ అధ్యక్షతన నిర్వహించారు. సభ సమావేశం కాగానే ఎత్తం ఎంపీటీసీ సాయినీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయంలో టాయిలెట్స్ నిర్మాణం నాసిరకంగా ఉందని, టాయిలెట్స్‌ను తనిఖీ చేసి బాధ్యులపైన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా మండల పరిషత్‌లో నిధులు ఉన్నా ఆఫీసులో కనీస వసతులు కరువయ్యాయని, గత రెండు సంవత్సరాలుగా ఇన్ వెర్టర్ బాగు చేయలేదని శ్రీనివాసరావును అడగ్గా ఎంపీపీ మాట్లాడుతూ ఇన్‌వెర్టర్ బ్యాటరీలు చెడిపో యాయన్నారు. ఆ చెడిపోయిన బ్యాటరీలు ఆఫీసులో ఉండాలి కదా గ్రామాల్లో గ్రామపంచాయతీ సామాగ్రి ఏదైనా పాడైనా గ్రామపంచాయతీ ఆఫీసుల్లోనే ఉంటాయి అన్నారు. అందుకు ఎంపీపీ సమాధానం దాటవేశారు. మండల పరిషత్‌లో ప్రస్తుతం ఉన్న సుమారు 20లక్షల రూపాయలతో మరమ్మతులు చేసి మిగతా డబ్బులు ఎంపీటీసీలకు కేటాయిస్తే గ్రామాల్లో పనులు చేయించవచ్చని సభ్యులు తీర్మానం చేశారు. గడ్డం నరసింహ మాట్లాడుతూ గ్రామాల నుంచి మండలానికి రావడానికి రోడ్లు సరిగ్గా లేవని కాంట్రాక్టర్లు రోడ్డు పనులు మధ్య మధ్యన ఆపేశారని వాటిని పూర్తి చేయలేదని అందుకు చర్యలు తీసుకో వాలన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలం లో వాగులపై వంతెనలు మంజూరై పనులు సగం వరకు చేసి ఆపేశారని వాటిని పూర్తి చేయాలన్నారు.

బావాయిపల్లి బ్రిడ్జి మంజూరైన శిలాఫలకం వరకే ఉన్నదని ప్రస్తుతం వర్షాకాలం వాగు దాటడం కష్టంగా ఉందని త్వరగా పూర్తి చేయా లన్నారు. సమావేశానికి ఎంపీడీవో శ్రీనివాసులు మండలంలో ఎంపీటీసీలు శ్యామల, నరసింహ, బాలయ్య, శ్రీనివాసరావు, మండలంలోని వివిధశాఖాధికా రులు, గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్స్, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

మద్యం డిపో ముందు ధర్నా



మద్యం డిపో ముందు ధర్నా చేస్తున్న నిరుద్యోగ యువకులు

తిమ్మాజిపేట, జూన్ 12 : తిమ్మాజిపేట మండల కేంద్రంలోని ఉమ్మడి పాలమూరు జిల్లాకు మద్యం డిపోలో హమాలీలుగా తమకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నిరుద్యోగ యువకులు దాదాపు రెండు గంటలపాటు ధర్నా చేశారు. నిరుద్యోగ యువకులకు డిపోలో పని చేసే హమాలీల మధ్య కాసేపు గొడవ జరగడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఈ మేరకు అక్కడ చేరుకున్న పోలీసుల జోక్యంతో ప్రశాంత వాతావరణం నెలకొంది. మద్యం డిపోలో ఇప్పటికే 70 మంది హమాలీలుగా పని చేస్తున్న మరికొందరిని తీసుకునే అవకాశాలు ఉన్నాయని అధికారులు గతంలో తెలిపారు. గత కొన్నేళ్లుగా తమకు హమాలీలుగా పని చేయడానికి అవకాశం కల్పించాలని పలు పర్యాయాలు, ధర్నాలు ఆందోళన కార్యక్రమాలు పలు పార్టీల మద్దతుతో చేశారు. కొందరు నిరుద్యోగ యువకులు కోర్టు ద్వారా అనుమతులు పొందామని హమాలీలుగా కొందరు పని చేయడానికి డిపోలో చేరారు. విషయం తెలుసుకున్న స్థానిక యువకులు ఆందోళనకు దిగారు. అన్‌లోడింగ్ వాహనాలను బయటకు వెళ్లకుండా లోడింగ్‌కు వీలు లేకుండా చేయడం పని కోసం వెళ్లినవారిని బయటకు పంపాలని డిమాండ్ చేస్తూ డిపో మేనేజర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరుద్యోగ యువకులకు కాంగ్రెస్ నాయకులు, బీజేపీ నాయకులు మద్దతు పలికారు. నిరుద్యోగ యువకులకు, నాయకులకు డిపోలో ప్రస్తుతం పని చేస్తున్న హమాలీల మధ్య వాగ్వాదంతో ఘర్షణ జరిగే సమయంలో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితులను శాంతింపజేశారు. ఆ 12మందిని బయటకు పంపించారు. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ మల్లురవి, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిలకు ఫోన్ ద్వారా డిపో ముందు జరుగుతున్న ఆందోళన కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను వివరించారు.

'గృహజ్యోతి లబ్ధిదారులు ఆందోళన చెందొద్దు'

కల్వకుర్తిటౌన్, జూన్ 12 : గృహజ్యోతి లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహజ్యోతి పథకం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున కొంత జాప్యం అయిందని, అర్హులైన ప్రతీ ఒక్కరికి జీరో బిల్లులు వస్తాయన్నారు. ప్రజాపాలనలో కొందరు పెట్టిన దరఖాస్తులలో ఇంటి కనెక్షన్ ఐడి నెంబర్ తప్పుగా వేయడం, అర్హత ఉన్నవారికి కూడా జీరో బిల్లులు రాలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ వందశాతం అమలు చేస్తుందని వివరించారు. తప్పుడు ప్రచారాలను ఎవరు నమ్మొద్దని, జీరోబిల్లు రానివారుఇంటికి వచ్చే అధికారులు, లేదా ఇంటి యజమానులు స్థానికంగా విద్యుత్ కార్యాలయంలో అధికారులును సంప్రదించాలని సూచించారు.

పాఠశాలలలో పారిశుధ్య కార్మికులను నియమించాలి

ఉప్పునుంతల, జూన్ 12 : పాఠశాలలలో పారిశుధ్య కార్మికులను నియమించాలని తపస్ జిల్లా తపస్ ప్రధాన కారదర్శి శేఖర్ అన్నారు. బుధవారం ఉప్పునుంతలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలు పునః ప్రారంభం అయిన సందర్భంగా పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులు లేక పరిశుభ్రతకు విఘాతం కలుగుతున్నందు వల్ల తప్పకుండా ప్రతీ పాఠశాలలో పారిశుధ్య కార్మికులతో పాటు, విద్యుత్‌ను ఏర్పాటు చేయాలన్నారు. మన ఊరు మన బడికి ఎంపికైన పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు.

ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేసిన ఏవో

లింగాల, జూన్ 12: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను బుధవారం మండల వ్యవసాయాధికారి నాగార్జున రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా షాపులలోని రికార్డులను, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులను కొనుగోలు చేసినరైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని డీలర్లను ఆదేశించారు. లైసెన్స్ కల్గిన డీలర్ల వద్దనే విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేయాలని ఏవో రైతులకు సూచించారు. ఇదిలా ఉండగా మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పర్యటించిన ఏవో రైతు సాగు పద్ధతులను పరిశీలించారు. సరైన పదునులోనే విత్తనాలను వేసుకోవాలని అధిక వర్షాలకు పొలాల్లో చేరిన నీటిని తీసి వేసి సాగు చేయాలని ఆయన రైతులకు సూచించారు.

వంట ఏజెన్సీ మహిళలకు రూ. 50 వేలు అందజేత



ముష్టిపల్లిలో మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీలకు రూ.50 వేలు అందజేస్తున్న గాదారి చంద్రశేఖర్

పెద్దకొత్తపల్లి, జూన్ 12 : మండల పరిధిలోని ముష్టిపల్లి గ్రామంలో ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం చేసే వంట ఏజెన్సీ మహిళలకు ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండి పెట్టడానికి ముగ్గురు మహిళలను ఏర్పాటు చేసి వారితో మాట్లాడి వారికి ప్రభుత్వం నుంచి బిల్లులు వచ్చే వరకు అయ్యే ఖర్చులను మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్‌ల అనుచరులు 50వేల రూపాయలను అందజేశారు.

ఘనంగా బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం

ఉప్పునుంతల, జూన్ 12: ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌శ్రీం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన బాలబాలికలు అందరూ పనుల్లో చేరకుండా పాఠశాలలో కళాశాలల్లో చేరి చదువుకోవాలన్నారు. బడీడు పిల్లలు బడిలో చేరేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందరూ కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు బాలమణి, శ్రీనివాసులు, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

మిషన్ భగీరథ సర్వేకు ప్రజలు సహకరించాలి

ఊర్కొండ, జూన్ 12: మండలంలో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ సర్వేను ప్రజలు సహకరించాలని ఎంపీడీవో విజయ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని బొమ్మరాజు పల్లి నిర్వహిస్తున్న మిషన్ భగీరథ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు ప్రతి ఇంటికి వెళ్లి నల్లా ద్వారా నీరు వస్తుందా లేదా అని అడిగి తెలుసుకోవాలని సూచించారు. ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ నల్లా ఉండేవిధంగా చూడాలని తెలిపారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ ఉన్నారు.

మిషన్ భగీరథ ట్యాప్ కనెక్షన్ డేటా ఎంట్రీని పూర్తి చేయాలి

తెలకపల్లి, జూన్ 12 : మిషన్ భగీరథ ట్యాప్ కనెక్షన్ సర్వేలో భాగంగా లబ్ధిదారుల వివరాలు వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో కృష్ణయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని గౌరారం, తాళ్లపల్లి, కార్వంగ గ్రామాల్లో నమోదు ప్రక్రియను పరిశీలించారు. అదేవిధంగా మండల పరిధిలోని నడిగడ్డ గ్రామంలో అమ్మ ఆదర్శ పాఠశాల పూర్తి చేసిన పనులను పరిశీలించారు. నడిగడ్డ, తాళ్లపల్లి నర్సరీలను పరిశీలించారు. మాజీ సర్పంచ్ భాస్కర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శులు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రైస్ మిల్లులో ధాన్యం పరిశీలన

చారకొండ, జూన్ 12: మండల కేంద్రంతో పాటు మండలంలోని జూపల్లిలో ఉన్న రైస్ మిల్లులను బుధవారం తహసీల్దార్ కేసీ ప్రమీల ఆకస్మికంగా తనిఖీ చేసి ధాన్యం నిలువలను పరిశీలించారు. ఈసందర్భంగా రైస్ మిల్లులలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ప్యాడి నుంచి ఎన్ని బస్తాలు అలాట్ అయ్యాయి... వారు ఎంత డిమాండ్ చేశారు... ఎంత డెలివరీ చేశారు... ఇంక ఎంత చేయాలని రైస్ మిల్లుల యజమానులను అడిగి తెలుసుకున్నారు. 2021, 22, 23లో నిల్వ ఉంచిన రబీ, ఖరీఫ్ వడ్లను పరిశీలించారు. నింధనల ప్రకారం మిల్లులను నడపాలని నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కోడేరు, జూన్ 12 : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో రెండు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపాల్ ఉమాఅస్త బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కెమిస్ట్రీ, బాటనీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పీజీ, బీఎడ్ అర్హత కలిగి ఉండాలన్నారు. ఈ నెల 13 నుంచి 18వరకు దరఖాస్తు చేసుకోవాలని 20న డెమో క్లాస్ ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.